యువతా మేలుకో.. ఓటు నమోదు చేసుకో

మేడ్చల్‌రూరల్: ఓటరు నమోదు ప్రతీ ఒక్కరూ బాధ్యతగా భావించాలని, 18 ఏళ్ల దాటిన యువత ఎప్పుడైనా ఓటు నమోదు చేసుకోవచ్చునని మేడ్చల్ తహసీల్దార్ శైలజ అన్నారు. జనవరి 1 నాటికి ప్రతీ ఏటా 18 ఏళ్ల నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హత పొందుతారన్నారు. ఈ నెల 25న జాతీయ ఓటరు దినోత్సవం కావడంతో ప్రతీ గ్రామంలోని బూత్ స్థాయి కార్యాలయాలలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి

జవహర్‌నగర్: బీఆర్ఎస్ హయాంలోనే జవహర్‌నగర్ కార్పొరేషన్ అభివృద్ధి జరిగిందని తెలంగాణ ఉద్యమకారుల సంఘం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు జిట్టా శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం జవహర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలోనే రూ.300 కోట్లతో ఎంతో అభివృద్ధి చెందిందని, మాజీ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ మేయర్ కావ్యల సహకారంతోనే జవహర్‌నగర్ రూపురేఖలు మారాయన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

12వ వార్డులో అభివృద్ధి పనులు ప్రారంభం



మేడ్చల్: పట్టణంలోని 12వ వార్డులో వివిధ అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికనర్సింహారెడ్డి కౌన్సిలర్ ప్రియాంక మధుకర్ యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. వార్డులో నిర్మించిన సీసీ రోడ్డు, శ్మశానవాటిక ప్రహరీగోడలను ప్రారంభించారు. ఐదేళ్ళుగా 12వ వార్డును అభివృద్ధి పథంలో నడిపించామని కౌన్సిలర్ ప్రియాంక మధుకర్ యాదవ్ అన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రమేష్, కమిషనర్ నాగిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శంకర్, సత్యనారాయణ వివిధ పార్టీల నాయకులు శైలేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మేడ్చల్: మేడ్చల్ పరిధిలోని 44వ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కండ్లకోయ నుంచి ఎల్లంపేట్ వరకు ఆస్తులు నష్టపోతున్న వారికి ప్రభుత్వం అధిక నష్టపరిహారం ఇవ్వాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మేడ్చల్‌లో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో నాయకుడు నందారెడ్డి, జగన్‌గౌడ్, పట్టణ అధ్యక్షురాలు శైలజ మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం వచ్చేలా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు ఇప్పటికే విన్నవించినట్లు నాయకులు తెలిపారు. విస్తరణలో పేదలు, రైతులు విలువైన స్థలాలు నష్టపోతున్నారని వారికి న్యాయం చేయాలని కోరారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



పోచారం: తెలంగాణ ఐటీ కారిడార్ హాస్టల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అమర్నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో జోడిమెట్లలోని నెక్స్‌జెన్ నీలాద్రి హాస్టల్‌లో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అమర్నాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. ఆదర్శప్రాయమైన రక్తదానం చేయడానికి యువకులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దాతలతో పాటు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

అక్రమ కనెక్షన్ల పేరుతో విద్యుత్ సరఫరా నిలిపివేత

కీసర: అక్రమ కనెక్షన్ల పేరుతో చీర్యాలలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు విద్యుత్ సరఫరాను అధికారులు సోమవారం నిలిపివేశారు. దీంతో 40 కుటుంబాలు చిమ్మచీకట్లో గడిపారు. ఇళ్లు కేటాయించి మౌలిక వసతులు కల్పించకపోవడం ఏంటని? బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి మౌలిక వసతులు కల్పించాలని, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు.

గణతంత్ర వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు

– జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్‌రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జిల్లా అధికారులు, పోలీసు అధికారులతో సోమవారం ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పోలీస్ గౌరవ వందన స్వీకరణ, బందోబస్తు ఏర్పాట్లతోసహా స్టేజీ, సీటింగ్, తాగునీరు, పారిశుధ్య ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సందేశ పుస్తకాన్ని నిర్దేశించిన సమయంలోపు రూపొందించాలన్నారు. పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రౌండ్‌లో మెడికల్ టీమ్‌తో ఎమర్జెన్సీ సేవలు, నిరంతరాయ విద్యుత్ సరఫరా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఉత్తమ సేవలందించిన ఉద్యోగులను గుర్తించి ఉత్తమ సేవా ప్రశంసా పత్రాల కోసం ప్రతిపాదనలు పంపాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అత్యంత ప్రతిష్టాత్మకమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తెలియజేసే స్టాళ్ల ఏర్పాట్లకు సన్నద్ధంగా ఉండాలని సంబంధిత శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. జిల్లా అధికారులు సమన్వయంతో గణతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాస్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు నిర్వహించే ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలలో ప్రొటోకాల్ నిబంధనలను జిల్లా అధికారులు ఖచ్చితంగా పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ రాములు, జిల్లా శాఖల అధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో 60 ఫిర్యాదులు



సాక్షి,సిటీబ్యూరో: వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యలకు సంబంధించిన అర్జీలను డీఆర్‌ఓ హరిప్రియతో కలిసి మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి స్వీకరించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో వివిధ సమస్యలకు సంబంధించి 60 ఫిర్యాదులు ప్రజావాణిలో అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. వివిధ శాఖలలో ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను పేర్కొంటూ.. ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ ఆయన చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

క్రీడాకారుల ఎంపిక కోసం 23, 24 తేదీల్లో టోర్నమెంట్

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో 2024–25 రాష్ట్ర సివిల్ సర్వీసెస్ క్రీడాకారుల ఎంపిక కోసం ఈ నెల 23, 24వ తేదీల్లో ఆలిండియా సివిల్ సెర్వీసెస్ టోర్నమెంట్‌ను నగరంలోని జింఖానా గ్రౌండ్, ఎల్‌బీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి గోపాల్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రింద పేర్కొనబడిన క్రీడలు 1. అథ్లెటిక్స్ (స్త్రీ–పు), 2.క్రికెట్, 3.చెస్(స్త్రీ–పు) 4. క్యారమ్స్ (స్త్రీ–పు), 5. హాకీ (స్త్రీ–పు), 6. పవర్ లిఫ్టింగ్ (స్త్రీ–పు), 7.స్విమ్మింగ్ (స్త్రీ–పు), 8. టేబుల్ టెన్నిస్ (స్త్రీ–పు), 9.వాలిబాల్ (స్త్రీ–పు), 10. వెయిట్ లిఫ్టింగ్ (స్త్రీ–పు), 11.బెస్టు ఫిజిక్, 12.రెజ్లింగ్, 13. ఖోఖో, 14. యోగా ఎంపికలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి కలిగిన మేడ్చల్–మల్కాజిరి జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు, మంగళవారం జిల్లా స్థాయి ఎంపికలకు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్నీ ఇతర వివరాలకు మేడ్చల్ కలెక్టరేట్‌లోని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా : చైర్మన్ లక్ష్మీనారాయణ



ప్రమాణస్వీకారం చేస్తున్న పెండం లక్ష్మీనారాయణ, ధర్మకర్తలు

శామీర్‌పేట్: ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఆలయ నూతన చైర్మన్‌గా నియమితులైన పెండం లక్ష్మీనారాయణ అన్నారు. మేడ్చల్ జిల్లా, తూంకుంట మున్సిపాలిటీ దేవరయాంజాల్ సీతారామ చంద్రస్వామి ఆలయ అభివృద్ధి చైర్మన్, ధర్మకర్తల ప్రమాణ స్వీకారం సోమవారం దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి సమక్షంలో జరిగింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్‌పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రభుత్వ సహకారంతో పాటు స్థానిక పెద్దల సూచనల మేరకు ఆలయ అభివృద్ధి కొరకు తమ వంతు కృషి చేస్తామని చైర్మన్ లక్ష్మీనారాయణ తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్, బి–బ్లాక్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, శామీర్‌పేట మండల అధ్యక్షుడు వైఎస్ గౌడ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నాం



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ శాంతి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ శివాజీనగర్‌లో సాధారణ నిధులు రూ.5 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను సోమవారం మేయర్ శాంతి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కార్పొరేషన్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. సీసీ రోడ్డుకు శాశ్వత పరిష్కారం చూపిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, కార్పొరేటర్లు లక్ష్మీకృష్ణగౌడ్, వేణు, మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, నాయకులు రమేష్ చారి, కాలనీవాసులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

సాక్షి,సిటీబ్యూరో: కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా నాయకులు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్‌ను కోరారు. సోమవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా డీఆర్‌ఓ హరిప్రియకు వినతి పత్రం అందజేశారు. జిల్లాలో దాదాపు 20 వేల గీత కార్మిక కుటుంబాలు ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయని, ప్రమాదకర వృత్తి అయినప్పటికీ బతుకుదెరువు కోసం కొనసాగిస్తున్నారని వారు పేర్కొన్నారు. గీతా కార్మికుడు చెట్టుపై నుంచి పడి చనిపోకుండా ఉండటానికి కాటమయ్య రక్షణ కిట్టులను మేడ్చల్ జిల్లాలో అందరికీ అందించాలన్నారు. గీతా కార్మికులందరికీ బైకులు ఇవ్వాలన్నారు. చెట్టుపై నుంచి పడి చనిపోయిన వారికి రూ. 25 వేలు, దెబ్బలు తగిలిన వారికి రూ.15 వేలు బీసీ కార్పొరేషన్ ద్వారా అందించే ఆర్థికసాయాన్ని సత్వరమే విడుదల చేయాలన్నారు. గీత కార్మికులకు ఇచ్చే ఫించన్‌ను రూ.4 వేలకు పెంచాలన్నారు. ఏజెన్సీ ఏరియాలో సొసైటీలను పునరుద్ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నరసయ్య, జిల్లా కార్యదర్శి లింగంగౌడ్, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందాలి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికి సంక్షేమ ఫలాలు అందజేస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య అన్నారు. రేషన్ కార్డులు, ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం వార్డుల్లో నిర్వహించే సమావేశంపై సోమవారం మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌తో కలిసి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ.. రేషన్ కార్డులు, ఇళ్ల ప్రక్రియపై చర్చించడానికి మున్సిపాలిటీలో ఈ నెల 21, 22, 23న వార్డు కౌన్సిలర్, ఇందిరమ్మ కమిటీ ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహిస్తారన్నారు.

అర్హులైన వారందరికీ పథకాలు వర్తించాలి..

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు కాంగ్రెస్ నాయకులు సూచించిన వారికే వర్తిసుందని చైర్ పర్సన్ ఎలా ప్రకటిస్తారని రెండో వార్డు కౌన్సిలర్ రమాదేవి ప్రశ్నించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందజేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, సంగీత, ఆంజనేయులుగౌడ్, అనురాధా, మల్లేష్, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షప్రధాన కార్యదర్శి ముత్యాలుయాదవ్, రాధాకృష్ణముదిరాజ్, డీసీసీ కార్యదర్శి ఆంజనేయులుయాదవ్, శివప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ కార్మిక సంక్షేమ మండలి కింద అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో భాగంగా కార్మికుల పిల్లలు, కార్మికులు ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని మేడ్చల్ ఏసీఎల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపకార వేతనాలు పొందటానికి దుకాణాలు, వాణిజ్య సంస్థలు, మోటారు రవాణా సంస్థలు తదితర కార్మికులు అర్హులన్నారు. 2023–24 విద్యా సంవత్సరంలో ఉతీర్ణులైన వారికి ప్రతిభ ఆధారంగా ఉపకార వేతనాలు అందించనున్నట్లు తెలిపారు. దరఖాస్తు ఫారములను కలెక్టరేట్‌లోని సంబంధిత జిల్లా సహాయ కార్మిక కమిషనర్ కార్యాలయములో పొందవచ్చునన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులను ఫిబ్రవరి 15 వరకు సంబంధిత కార్మిక శాఖ కార్యాలయములో సమర్పించాలన్నారు. అసంపూర్తిగా ఉన్న లేక గడువు తరువాత సమర్పించబడిన దరఖాస్తులు తిరస్కరించబడుతాయన్నారు. ఎంపికైన అభ్యర్థులకు మేడే నాటికి ఉపకారవేతనాలను సంబంధిత సహాయ కమిషనర్లు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలలో జమ చేస్తారన్నారు.

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: నూతన్‌కల్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా నేడు మండలంలోని పలు గ్రామాలలో కరెంట్ సరఫరా ఉండదని రూరల్ ఏఈ మౌలాలి తెలిపారు. నూతన్‌కల్, లింగాపూర్, కోనాయిపల్లి, మైసిరెడ్డిపల్లి గ్రామాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు, బండ మాదారం, శ్రీరంగవరం, రాయిలాపూర్, గిర్మాపూర్, గ్రామాల పరిధిలో మధాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

ఉచిత కోచింగ్ కోసం దరఖాస్తు చేసుకోవాలి

సాక్షి,సిటీబ్యూరో: ఆర్‌ఆర్‌బీ, ఎస్ఎస్‌సీతోసహా బ్యాంకింగ్ రిక్రూట్‌మెంట్ ఫౌండేషన్ కోర్సుకు ఉచిత కోచింగ్ కార్యక్రమాన్ని ఫిబ్రవరి 15 నుంచి రాష్ట్రంలోని 12 టీజీ బీసీ స్టడీ సర్కిళ్లలో నిర్వహిస్తున్నట్లు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా బీసీ అభివృద్ధిశాఖ అధికారి ఇందిర ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు మంగళవారం నుంచి ఫిబ్రవరి 9 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షల లోపు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల లోపు ఉండాలన్నారు. అభ్యర్థుల ఎంపిక విధానం రూల్ ఆఫ్ రిజర్వేషన్‌తో పాటు ఇంటర్మీడియట్, డిగ్రీ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా ఉంటుందన్నారు. అర్హులైన అభ్యర్థులకు సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఫిబ్రవరి 12 నుంచి 14 వరకు ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 040–24071178 ఫోన్ నెంబర్ సంప్రదించాలని ఆమె సూచించారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

గౌతంనగర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించేందుకు భాష్యం విద్యాసంస్థలు ఎంతో ప్రోత్సాహం అందిస్తున్నాయని విద్యాసంస్థల సీఈవో చైతన్య అన్నారు. భాష్యం విద్యార్థుల ప్రిలిమినరీ క్రికెట్ మ్యాచ్ సోమవారం కీసరలోని స్కై పార్క్ మైదానంలో నిర్వహించారు. ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ జోన్–2 జట్టు రెండు మ్యాచ్‌లలోనే గెలిచి క్వార్టర్ ఫైనల్స్‌కి చేరుకుంది. విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణ, జెడ్‌ఈఓలు మార్కండేయులు, అంకమ్మరావు, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్ట్రీట్ వెండర్స్ డే

మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్ జీహెచ్ఎంసీ స్ట్రీట్ వెండర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'స్ట్రీట్ వెండర్స్‌డే'ను ఆనంద్‌బాగ్‌లో ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు బాజీభాష మాట్లాడుతూ.. తమ వ్యాపారాలు సరిగ్గా జరగడం లేదని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. తమ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. యాదగిరి, జాన్, అలివేలు, లక్ష్మయ్య, నాగరాజు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపే లక్ష్యం



బీజేపీ అధ్యక్షురాలిని సన్మానిస్తున్న నాయకులు

మేడ్చల్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో మేడ్చల్ మున్సిపాలిటీలో బీజేపీ గెలుపే తమ లక్ష్యమని మేడ్చల్ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షురాలు శైలజాహరినాథ్ అన్నారు. పట్టణ బీజేపీ అధ్యక్షురాలిగా నియమితులైన సందర్భంగా ఆమె పట్టణ నాయకులతో సమావేశం నిర్వహించగా నాయకులు ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షులుగా తనకు స్థానం కలిపించడం ఆనందంగా ఉందన్నారు. పార్టీని అన్ని వార్డులలో బలోపేతం చేస్తూనే రాబోయే ఎన్నికలలో సత్తా చాటేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సీనియర్ నాయకులు నందారెడ్డి, జగన్‌గౌడ్, ప్రేందాస్, శ్రీకాంత్, శ్రీనివాస్‌గౌడ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కెమికల్ వ్యర్థాలతో అగ్నిప్రమాదం..

తృటిలో తప్పిన ముప్పు



అగ్నికి ఆహుతి అవుతున్న వ్యర్థాలు



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి పూడూర్ గ్రామంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. గ్రామ పరిధిలోని 608 సర్వే నెంబర్‌లో గల ఖాళీ భూముల్లో కొద్ది రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు కంపెనీ వ్యర్థాలు పడేసి వెళ్లగా సోమవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు వాటికి నిప్పు అంటుకోవడంతో మంటలు చెలరేగాయి. కెమికల్ వ్యర్థాలు కావడంతో మంటలు ఒక్కసారిగా ఎగిసిపడ్డాయి. ఈ నేపథ్యంలో గాలుల దాటికి సమీపంలో ఖాళీగా ఉన్న భూముల్లోకి మంటలు విస్తరించాయి. ఆ భూముల్లో పంటలు వేయకపోవడంతో ఎండు గడ్డి, పిచ్చి మొక్కలు ఉండడంతో ఎలాంటి నష్టం వాటిల్లలేదు. ఓ దశలో మంటలు భారీగా ఎగసిపడడంతో తమ పంట పొలాల్లోకి మంటలు వస్తాయని ఆందోళనకు గురైన రైతులు మంటలను అదుపు చేసేందుకు పలు ప్రయత్నాలు చేశారు. స్థానికులు ఫైర్ ఇంజన్‌కు సమాచారం ఇవ్వగా సమీపంలోకి తుర్కపల్లికి చెందిన అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

క్రీడా మైదాన స్థలాన్ని కాపాడాలని వినతి



అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం అందచేస్తున్న బీజేపీ నాయకులు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నెంబర్–704, 706లో గతంలో క్రీడా మైదానానికి కేటాయించిన ఐదు ఎకరాల స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలని కోరుతూ బీజేపీ నాయకులు సోమవారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కార్యాలయంలో ప్రజాదర్బార్‌లో అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2020లో సర్వే నెంబర్–704,706లో క్రీడా మైదానం కోసం కేటాయించి బోర్డును కూడా ఏర్పాటు చేశారని, ఆ బోర్డును తొలగించి అందులో నిర్మాణాలు చేపట్టినప్పటికి అప్పటి నాయకులు పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేసి ఫెన్సింగ్ చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి రంగుల శంకర్, ఎస్సీ మోర్చా సెక్రటరీ సుజాత, జవహర్‌నగర్ అధ్యక్షురాలు లక్ష్మిరెడ్డి, మహేష్‌గౌడ్, శివకేశవ్, శ్రీనివాస్ గౌడ్, రాహుల్‌సింగ్, సాయినాథ్, బాలకృష్ణ, భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

'మాజీ ఎంపీపీ వ్యాఖ్యలు సరికాదు'



విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు

పోచారం: కొర్రెముల్ గ్రామ పరిధిలోని ఏకశిలానగర్ వెంచర్‌ను మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి అండతో బిల్డర్ ఎ.వెంకటేశ్ ఆక్రమిస్తున్నట్లు మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి ఆదివారం చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కర్రె రాజేష్ తీవ్రంగా ఖండించారు. సోమవారం చౌదరిగూడలోని మక్తలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ ఆస్తుల్లో రాజకీయ నాయకులు జోక్యం చేసుకోవడం తగదని హితవు పలికారు. ఇప్పటికైనా బీజేపీ నాయకులు చౌకబారు విమర్శలను మానుకోవాలని హెచ్చరించారు. సమావేశంలో మాజీ ఎంపీటీసీలు కందుల కుమార్, వులకంటి భాస్కర్‌రెడ్డి, మాజీ వార్డు మెంబర్ బోజిరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు కట్ట ఆంజనేయులు గౌడ్ నాయకులు సిద్ధగోని నర్సింహ, భాస్కర్, నర్సింగరావు, రవి, జంగయ్య పాల్గొన్నారు.

చట్టబద్ధంగా భూమిని కొనుగోలు చేశాను..

కొర్రెముల్‌లోని సర్వే నెంబర్లు 739, 740, 741, 742లో 47 ఎకరాల 25 గుంటల భూమిని పట్టాదారుల నుండి తాను కొనుగోలు చేశానని, అందుకు సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు ఉన్నాయని బిల్డర్ వెంకటేశ్ స్పష్టం చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. క్యాన్సిల్ అయిన ఏకశిలానగర్ వెంచర్‌లో కొందరు రియల్ ఎస్టేట్ బ్రోకర్లు అమాయకులైన ప్రజలకు ప్లాట్లు అమ్మి, సొమ్ము చేసుకున్నారని చెప్పారు. ప్లాట్ల కొనుగోలుదారుల ఒత్తిడి నుండి తప్పించుకునేందుకు తన భూమిలో వారి ప్లాట్లు ఉన్నాయని తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులకు రియల్ ఎస్టేట్ బ్రోకర్లు తప్పుడు పత్రాలు అందజేసి తనపై దుష్ప్రచారం చేస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు, రాజకీయ నాయకులు కోర్టు ఆదేశాలను పరిశీలించి వాస్తవాలను అర్థం చేసుకోవాని కోరారు.

ఆస్కార్ అవార్డుతో తెలుగు భాషకు గుర్తింపు



విద్యార్థులకు మెడల్స్ అందజేస్తున్న ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

పోచారం: ప్రపంచంలో అత్యున్నత పురస్కారమైన ఆస్కార్ అవార్డుతో తెలుగు భాష చరిత్ర సృష్టించిందని ప్రముఖ సినీ గేయ రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ అన్నారు. 95 ఏళ్ల ఆస్కార్ చరిత్రలో సంపూర్ణ భారతీయ చిత్రానికి వచ్చిన మొట్టమొదటి ఆస్కార్ అవార్డు తెలుగు చలన చిత్రానికి తాను రచించిన 'నాటు నాటు..' పాటతో వచ్చిందన్నారు. చౌదరిగూడలోని విజయరత్న సీబీఎస్ఈ స్కూల్ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబోస్ మాట్లాడుతూ.. తెలుగు భాషకు ఆస్కార్ అవార్డు రావడం అత్యంత గౌరవప్రదమన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలతో పాటు పతకాలను ఆయన అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు డాక్టర్ విజయసేనారెడ్డి, నరేంద్రనాథరెడ్డి, నర్సింహారావు, శ్రీనివాసరెడ్డి, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల కోసం రూ. 3.80 కోట్లు కేటాయింపు

కీసర: నాగారం మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనుల చేపట్టేందుకు రూ. 3.80 కోట్ల నిధులు కేటాయిస్తూ పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానించినట్లు చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి చెప్పారు. నాగారం మున్సిపాలిటీలో చైర్మన్ చంద్రారెడ్డి అధ్యక్షతన సాధారణ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. నాగారం పురపాలక సంఘ అభివృద్ధికి సహకరించిన కౌన్సిల్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో చేపట్టనున్న సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఇతర పనుల కోసం నిధులు కేటాయించామన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, కమిషనర్ భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ చంద్రారెడ్డి